సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 28 । నవంబర్ । 2024



ఉద్యమ నేతకు అశ్రునివాళి

సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ గుండెపోటుతో మృతిచెందగా, పలువురు దిగ్భ్రాంతి చెందారు. 8లో



చట్టాలపై అవగాహన ఉండాలి

రైతులకు వ్యవసాయ, భూ చట్టాలపై అవగాహన ఉండాలని మణుగూరు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సూరిరెడ్డి అన్నారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 28° / 18°

జిల్లాలో గురువారం ఉదయం మంచు కురుస్తుంది. మధ్యాహ్నం తర్వాత ఆకాశం మేఘావృతంగా మారుతుంది.

న్యూస్‌రీల్

గోదావరి నదికి పుణ్యహారతి



గోదావరికి హారతి సమర్పిస్తున్న అర్చకులు, వేద పండితులు

భద్రాచలంటౌన్: శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం గోదావరికి పుణ్యహారతి నిర్వహించారు. దీంతో నదీతీరంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. కార్తీకమాసం బహుళ ద్వాదశి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. నది ఒడ్డున ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టేజీపై స్వామివారి పాదుకలకు వేదపండితులు పూజలు జరిపారు. భక్తుల శ్రీరామనామస్మరణతో భద్రగిరి పులకించింది. తొలుత నదీ తీరంలో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ గోదావరి తల్లికి పసుపు, కుంకుమ, పట్టువస్త్రాలు సమర్పించారు. వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రేపు పెద్దమ్మతల్లి ఆలయంలో రుద్రహోమం

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో ఈ నెల 29న మాస శివరాత్రి సందర్భంగా రుద్ర హోమం పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి)ఆలయంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రుద్రహోమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూజలో పాల్గొనే భక్తులు రూ.1,516 చెల్లించి గోత్ర నామాలను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 63034 08458 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మావోయిస్టులకు సహకరించవద్దు

ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ

గుండాల: ఆదివాసీల అభివృద్ధికి అడ్డంకిగా మారిన మావోయిస్టులకు సహకరించొద్దని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను అన్నారు. కొమరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని శెట్టిపల్లి గ్రామంలో గుండాల ఆస్పత్రి సిబ్బంది సహకారంతో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామానికి చెందిన 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే ఆదివాసీల సంక్షేమానికి కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తేపోలీసు వారికి సమాచారం అందించాలని కోరారు. గుండాల సీఐ ఎల్.రవీందర్ , ఎస్సై సోమేశ్వర్, వైద్యాధికారి మనీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వే ఆఫీసర్ పోస్టులకు నోటిఫికేషన్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ 64 జూనియర్ సర్వే ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. పోస్టులను ఇంటర్నల్ అభ్యర్థులతో భర్తీ చేయనుంది. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 28 నుంచి డిసెంబర్ 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరింది. హార్డ్ కాపీలను డిసెంబర్ 14లోపు కొత్తగూడెంలోని జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కార్యాలయంలో అందించాలని పేర్కొంది.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన పలు సూచనలు చేశారు. కష్టపడి పండించిన పంట అమ్మకంలో దళారులను నమ్మి మోసపోవద్దని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే మద్దతు ధరతోపాటు బోనస్ కూడా అధికంగా లభిస్తుందని తెలిపారు. కేంద్రాలకు తెచ్చిన ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తామని తెలిపారు. బిల్లులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు వివరించారు.

సమీకృత గురుకులంతో సౌకర్యాలు..

విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందే అవకాశం

- అసౌకర్యాలతో సతమతమవుతున్న ప్రస్తుత గురుకులాలు
- అద్దె భవనాలు, సిబ్బంది కొరతతో విద్యార్థుల అవస్థ
- ప్రభుత్వ ప్రకటనతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో హర్షాతిరేకాలు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని గురుకుల పాఠశాలలు, కళాశాలలు అసౌకర్యాల నడుమ కొనసాగుతున్నాయి. అందులో చదివే విద్యార్థులు అవస్థలు పడుతూ విద్యనభ్యసిస్తున్నారు. ఇలాంటి పరిస్థితిలో ప్రభుత్వం రెండో విడతలో జిల్లాకు సమీకృత గురుకులం మంజూరు ప్రకటనతో అందరిలో ఆశలు చిగురించాయి. జిల్లాలో సమీకృత గురుకులం నిర్మాణం జరిగితే పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది. డిజిటల్ విద్య, ఇంటర్నెట్, కంప్యూటర్, ల్యాప్‌టాప్ వంటి సౌకర్యాలు విద్యార్థులకు అందుతాయి. జిల్లాకు గురుకులం మంజూరు చేసినట్లు ప్రకటించిన ప్రభుత్వం, జిల్లాలోని ఏ నియోజకవర్గంలో నిర్మించే విషయమై స్పష్టత ఇవ్వలేదు. సమీకృత గురుకులం నిర్మాణానికి విశాలమైన భూమి, సౌకర్యాలపై జిల్లా అధికారులు, విద్యాధికారులు పరిశీలన చేస్తున్నట్లు సమాచారం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులలాన్నీ కలిపి ఒకే ప్రాంగణంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాకు ప్రస్తుతం ఒక సమీకృత గురుకులం



జిల్లా విద్యాశాఖ కార్యాలయం

మంజూరు కాగా, భవిష్యత్‌లో నియోజకవర్గానికి ఒకటి మంజూరు చేయించాలనే ఆలోచన, ప్రయత్నంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు ఉన్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గానికో సమీకృత గురుకులం ఏర్పాటైతే ఏజెన్సీ జిల్లాలో విద్య మరింత అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లే అవకాశం ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్ విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది.

ప్రతిపాదనలు అడగలేదు



జిల్లాకో సమీకృత గురుకులం మంజూరైందని పేపర్లలో చూశాం. కానీ ఇంతవరకు ఎటువంటి అధికారిక సమాచారం లేదు. ఏ ప్రాంతం, ఎంత విస్తీర్ణం అనే విషయాలు విద్యాశాఖకు సమాచారం లేదు. ప్రతిపాదనలపై విద్యాశాఖ నుంచి కూడా వివరాలు అడగలేదు.

–ఎం.వెంకటేశ్వరాచారి, డీఈఓ

అద్దె భవనాల్లో ప్రస్తుత గురుకులాలు..

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మోడల్ స్కూల్, కస్తూర్బా, ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలు, కళాశాలలు అద్దె భవనాలు, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో కొనసాగుతున్నాయి. విద్యార్థులు ఇరుకుగదుల్లో విద్యాభ్యాసం చేస్తూ హాస్టళ్లలో అవస్థలు పడుతున్నారు. దీంతోపాటు గురుకులాల్లో బోధన, బోధనేతర సిబ్బంది కొరత కూడా తీవ్రంగా వేధిస్తోంది. అద్దె భవనాలకు కూడా ప్రభుత్వం రూ.లక్షల్లో అద్దెలు చెల్లించాల్సిన పరిస్థితి ఉంది. ఈ సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. అన్ని గురుకులాలు కలిసి ఒకే ప్రాంగణంలోకి వస్తే సౌకర్యాలు, విద్యాభ్యాసం మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సమీకృత గురుకులాల నిర్మాణం పూర్తయితే, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్ గురుకులాల విద్యార్థులంతా సమీకృత గురుకులంలో చదువుకునే అవకాశం ఉంటుంది.

జిల్లాలోని గురుకులాల వివరాలు

విద్యా సంస్థలు	సంఖ్య	విద్యార్థులు
కేజీబీవీలు	14	3,716
టీఎస్ మోడల్ స్కూళ్లు	9	4,846
అర్బన్ రెసిడెన్షియల్‌లు	1	74
మైనారిటీ వెల్ఫేర్ స్కూళ్లు	8	1,957
ఎంజేపీ (బీసీ)లు	11	4,164
టీఎస్‌టీడబ్ల్యూఆర్‌ఈఐఎస్‌లు	14	5,475
టీడబ్ల్యూ ఆశ్రమ పాఠశాలలు	79	14,171

సమస్యలు పరిష్కరించేనా?



సింగరేణి ప్రధాన కార్యాలయం

- 11 నెలల జాప్యం తర్వాత సమావేశం నిర్వహిస్తున్న యాజమాన్యం
- డైరెక్టర్ (పా)స్థాయిలో గుర్తింపు కార్మిక సంఘం నేతల చర్చలు
- నేడు కొత్తగూడెంలో సింగరేణి కంపెనీస్థాయి స్ట్రక్చరల్ మీటింగ్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులు సుమారు 11 మాసాలుగా ఎదురుచూస్తున్న కంపెనీస్థాయి స్ట్రక్చరల్ సమావేశం ఈ నెల 28న కొత్తగూడెంలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించనున్నారు. గత డిసెంబర్ నెలాఖరులో జరిగిన ఎన్నికల్లో ఏఐటీయూసీ గుర్తింపు కార్మిక సంఘంగా ఎన్నికయ్యాక తొలిసారిగా సమావేశం నిర్వహిస్తున్నారు. స్ట్రక్చరల్ సమావేశం మూడు మాసాలకోసారి నిర్వహించాల్సి ఉండగా, 11 నెలల తర్వాత జరుపుతున్నారు. ఈ సమావేశంలో కార్మిక సమస్యలను చర్చించి పరిష్కరించాలని కార్మికులు, కార్మిక నాయకులు కోరుతున్నారు. క్రమంతప్పకుండా మూడు నెలలకోసారి స్ట్రక్చరల్ సమావేశం నిర్వహించాలని గుర్తింపు కార్మిక సంఘానికి, సింగరేణి యాజమాన్యానికి కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు

- సొంతింటి కోసం 250 గజాల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.30 లక్షల వడ్డీలేని రుణం ఇవ్వాలి.
- విజిలెన్స్ విచారణలో పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ల వారసులకు షరతులు లేకుండా ఉద్యోగాలు ఇవ్వాలి.
- లాభాల వాటా, దీపావళి బోనస్‌ను ప్రత్యేక వాటాగా ప్రకటించాలి.
- రూ.12 లక్షలకు పైగా వచ్చిన వారికి మాత్రమే ఇన్‌కమ్ ట్యాక్స్ 5శాతం పడేలా చూడాలి.
- భూగర్భ గనుల్లో పనిచేసే కార్మికులకు వెంటిలేషన్ సదుపాయం కల్పించాలి
- పెండింగ్‌లో కేడర్ స్కీమ్‌ను అమలు చేయాలి.
- సర్వీసుతో నిమిత్తంలేకుండా అనారోగ్యంతో ఉన్నవారిని మెడికల్ బోర్డ్‌కు అనుమతించాలి.
- కొత్తగనుల విషయంలో విధాన పరమైన చర్యలు తీసుకోవాలి.
- 2 వేల మీటర్లలో లోతుల్లో పనిచేసే కార్మికులకు స్పెషల్ అలవెన్స్‌లు అమలు చేయాలి.
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా సింగరేణి కార్మికులకు హౌసింగ్ సొసైటీ ఏర్పాటు చేయాలి.
- కార్మికుడు మరణిస్తే ఆర్మీస్థాయిలో అంతిమ యాత్రను అధికార లాంఛనాలతో నిర్వహించాలి.
- కార్మికులకు సరిపడా పనిముట్లు అందించాలి.

మారుపేర్లపై చర్చించాలి

డైరెక్టర్ పా స్థాయిలో ఈ నెల 28న సింగరేణి ప్రధాన కార్యాలయంలో జరిగే స్ట్రక్చరల్ సమావేశంలో మారుపేర్ల సమస్యపై చర్చించాలి. విజిలెన్స్ విచారణలో పెండింగ్‌లో ఉన్న సుమారు 500 దరఖాస్తులను పరిష్కరించి, డిపెండెంట్ల కుటుంబాలకు న్యాయం చేయాలి. డిపెండెంట్ ఉద్యోగ దరఖాస్తుకు కాలపరిమితి ఎత్తివేయాలి. డిస్మిస్డ్ కార్మికులకు వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద అవకాశం కల్పించాలి.

–అంతోటి నాగేశ్వరరావు, అసోషియేషన్ జనరల్ సెక్రటరీ

హామీలు అమలు చేయాలి

సుమారు సంవత్సర కాలం తర్వాత సింగరేణిలో డైరెక్టర్ పా స్థాయి స్ట్రక్చరల్ సమావేశం నిర్వహిస్తున్నారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో నాయకులు కార్మికులకు ఇచ్చిన హామీలైన సొంతింటి కల నెరవేర్చాలి. ఇతర కార్మికులకు లాభం చేకూర్చే పలు అంశాలపై చర్చించి న్యాయం చేయాలి. మూడు మాసాలకోసారి జరిగే సమావేశాలను తీవ్ర జాప్యం చేశారు. ఇకనైనా సకాలంలో నిర్వహించాలి.

–మందా నర్సింహారావు, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

- అధికారుల పనితీరుపై ఫిర్యాదులొస్తున్నాయి
- తీరు మారకపోతే చర్యలు తప్పవు
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

కొత్తగూడెంరూరల్ : రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన చుంచుపల్లిలోని క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలుంటాయని హెచ్చరించారు. పలు శాఖల అధికారులపై ఫిర్యాదులొస్తున్నాయని తెలిపారు. సీఎస్ఆర్ నిధులు సక్రమంగా వినియోగించకపోతే శాఖపరమైన చర్యలు ఉంటాయని సీపీఓను హెచ్చరించారు. అటవీశాఖ నుంచి అనుమతులు పొంది జాప్యం లేకుండా రోడ్డు అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఈఈలకు సూచించారు. పంచాయతీ సెక్రటరీలు పనిచేస్తున్న గ్రామాల్లో నివాసం ఉండాలని, వారిపై డీపీఓ పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. గ్రామాల్లో వీధిలైట్లు, తాగునీటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. పలువురు ఎమ్మార్వోలపై వరుసగా ఫిర్యాదులందుతున్నాయని, వారిపై ఆర్డీఓల పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. మున్సిపాలిటీల అభివృద్ధి పనుల్లో మెరుగైన పనితీరు కోసం ఒక్కరికే రూ.50లక్షల ఆపై టెండర్లు ఇవ్వాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు విధులు సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. అధికారులు అలర్ట్‌గా ఉండాలని, స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుని విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.

సమష్టిగా కృషి చేయాలి



బొగ్గు ఉత్పత్తిని పరిశీలిస్తున్న అధికారులు

మణుగూరు టౌన్: నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధన కోసం అధికారులు, కార్మికులు సమష్టిగా కృషి చేయాలని డైరెక్టర్ (పీఅండ్‌పీ), (పా) జి.వెంకటేశ్వరరెడ్డి సూచించారు. బుధవారం సింగరేణి మణుగూరు ఏరియాలో పర్యటించిన ఆయన ఏరియా జీఎం దుర్గం రాంచందర్, పీఓ లక్ష్మీపతిగౌడ్, ప్రాజెక్ట్ అధికారులతో కలిసి వ్యూ పాయింట్ల నుంచి ఓసీ–2, మణుగూరు ఓసీ, ఓసీ–4 గనుల్లో బొగ్గు ఉత్పత్తిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్యాంసుందర్, సురేశ్, రమణారెడ్డి, శ్రీనివాసచారి, రాజేశ్వరరావు, చిట్టా శ్రీనివాస్, రాజేశ్వరరావు, కట్ల శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర కులగణన సర్వే చరిత్రాత్మకం

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్రంలో చేపడుతున్న సమగ్ర కులగణన సర్వే చరిత్రాత్మకమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. అలంపూర్ నుంచి ఆదిలాబాద్ వరకు చేపట్టిన బీసీ కులగణన చైతన్య యాత్ర సందర్భంగా బుధవారం కొత్తగూడెంలో నిర్వహించిన చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. కులగణన నిర్వహించి, బీసీల లెక్కలు తేల్చాలని మూడు దశాబ్దాలుగా చేస్తున్న పోరాటం తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేతో ఫలప్రదమైందని పేర్కొన్నారు. బీసీల లెక్కలు తేలాక జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెరిగే అవకాశం ఉందన్నారు. కులగణనను అడ్డుకోవాలని చూసిన రాష్ట్రంలోని కొన్ని శక్తుల ప్రయత్నాలు ఫలించలేదన్నారు. సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొనకుండా కులగణనను వ్యతిరేకిస్తున్న వారికి రిజర్వేషన్లు పొందే హక్కు లేదన్నారు. కులగణన సర్వేలో పాల్గొననివారిని గుర్తించి ప్రభుత్వం వాళ్ల రిజర్వేషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా బీసీ సంక్షేమ సంఘం నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. నాయకులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్,అకినీడు ప్రసాద్, సోమేశ్వర్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, లక్ష్మణాచారి , వెంకటేష్‌గౌడ్, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్ గౌడ్

జాతీయస్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపిక





జాతీయస్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపికైన ఎగ్జిబిట్లతో విద్యార్థులు, టీచర్లు

కొత్తగూడెంఅర్బన్: డిసెంబర్ 16 నుంచి 21వ తేదీ వరకు హరియాణాలోని పంచకులలో జరిగే జాతీయస్థాయి సైన్స్‌ఫేర్‌కు జిల్లా నుంచి టి.వరుణ్ కోమల్, బి.దీప్సికా, ఎస్.దీపాహస్మిత ఎంపికయ్యారు. ఈ మేరకు డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి బుధవారం వివరాలు వెల్లడించారు. ఫిబ్రవరిలో విజయవాడలో జరిగిన సౌత్ ఇండియా సైన్స్‌ఫేర్‌లో జిల్లా నుంచి నాలుగు ఎగ్జిబిట్లు ప్రదర్శించగా, రెండు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయని తెలిపారు. ఇల్లెందు సింగరేణి ఉన్నత పాఠశాల విద్యార్థి టి.వరుణ్‌కోమల్ స్మార్ట్–అగ్రి రోబో రూపొందించి.. వ్యవసాయ రంగంలో విత్తనాలు నాటడం, దున్నడం, పురుగు మందుల పిచికారీ తదితర పనులకు రోబో వినియోగించే తీరును వివరించారు. ఈ ఎగ్జిబిట్‌కు గైడ్ టీచర్‌గా ఎం.విష్ణుప్రియ వ్యవహరించారు. కొత్తగూడెం లక్ష్మీదేవిపల్లిలోని త్రివేణి పాఠశాల విద్యార్థులు బి.దీప్సికా, ఎస్.దీపాహస్మిత లిక్విడ్ ట్రీ–బయోఎంజైమ్స్ ఎగ్జిబిట్‌ను రూపొందించారు. పట్టణ ప్రాంతాలు, పర్యావరణ కాలుష్య ప్రాంతాల్లో లిక్విడ్ ట్రీ ప్లాంటేషన్‌తో కాలుష్యం తగ్గించవచ్చని వివరించారు. ఈ ప్రాజెక్ట్ కు గైడ్ టీచర్‌గా పి.జ్యోతి వ్యవహరించారు. జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులను జిల్లా సైన్స్ ఆఫీసర్ చలపతిరాజు తదితరులు అభినందించారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఇందిరమ్మ ఇళ్లు, జీఓ నంబర్ 76 లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. బుధవారం జిల్లాలోని ఆర్డీఓలు, తహసీల్దార్లతో ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, జీఓ నంబరు 76, పోడు భూముల సమస్యలపై, ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికపై కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజావాణిలో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులపై త్వరితగతిన నివేదికలు అందించాలన్నారు. జీఓ నంబర్ 76 ప్రకారం వచ్చిన దరఖాస్తులపై తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ఇంకా పూర్తి కానివి, పరిశీలన అనంతరం తిరస్కరణకు గురైన దరఖాస్తులు, డిమాండ్ నోటీస్ జారీ చేసిన దరఖాస్తులు, చెల్లింపులు పూర్తి చేసిన దరఖాస్తుల పూర్తి వివరాలతో కూడిన నివేదికలను అందించాలని ఆదేశించారు. జీఓ నంబరు 76 ప్రకారం 2014 ముందు ఉన్న ధ్రువీకరణ పత్రాలు తప్పకుండా దరఖాస్తుకు జతపర్చాలని అన్నారు. దరఖాస్తు చేసుకున్న పోడు భూములకు పట్టాలు రాకపోతే, వారికి పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేస్తామన్నారు. జిల్లాలో మొత్తం 323 ఇందిరమ్మ ఇళ్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో ఎస్సీ, ఎస్టీ, నిరుపేద కాలనీల్లో పర్యటించి అర్హుల కుటుంబాలను గుర్తించాలన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ జితేష్ తదితరులు

సత్వరమే పూర్తి చేయాలి

జిల్లాలో అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. బుధవారం జిల్లాలో పురోగతిలో ఉన్న యాస్పిరేషన్, కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, మొబైల్ హాస్పిటల్స్, గిరిజన పాఠశాలల్లో అభివృద్ధి పనులు, గ్రంథాలయాల ఏర్పాటు, సౌకర్యాల కల్పన, పోలీస్ స్టేషన్ల ఆధునీకరణ, మార్చురీల నిర్మాణం, మినీ ఇండోర్ స్టేడియాలు, మినీరైస్ మిల్స్ తదితర అభివృద్ధి పనులపై ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీఓ రాహుల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తదితర అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022–23, 2023–24 సంవత్సరాల నిధులు మంజూరై పూర్తి చేయని పనులను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. చర్ల మండలంలో మినీ రైస్‌మిల్ స్థాపనకు నివేదికలు తయారు చేయాలన్నారు.

బాల్యవివాహాలను నిర్మూలించాలి

పాల్వంచ: బాల్య వివాహాలను నిర్మూలించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పిలుపునిచ్చారు. బుధవారం యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సంస్థ, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్ ఆధ్వర్యంలో కేజీబీవీ పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ చిన్న వయసులో వివాహం చేస్తే బాలికలు శారీరక, మానసిక రుగ్మతలకు గురవుతారని తెలిపారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి గొల్లపూడి భానుమతి మాట్లాడుతూ బాలలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. అధికారులు, ఆయా సంస్థల ప్రతినిధులు కె.అంబేద్కర్, సాధిక్‌పాషా, లెనినా, రాజేష్, అన్నామణి, లక్ష్మీ ప్రసన్న, హరికుమారి, తులసి, రాజమల్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంతర్జాతీయ సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపిక


సంపత్‌కుమార్

జూలూరుపాడు: అసోం రాష్ట్రం గువాహటి ఐఐటీలో ఈ నెల 30 నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు జరిగే ఇండియన్ ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో జరిగే టీచర్స్ వర్క్‌షాప్‌నకు జూలూరుపాడు మండలం కాకర్ల హైస్కూల్‌లో ఫిజిక్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బి.సంపత్‌కుమార్ ఎంపికయ్యారు. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఇండియా వారి నుంచి ఆహ్వానం అందినట్లు ఉపాధ్యాయుడు సంపత్‌కుమార్ బుధవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో ఉపాధ్యాయ బోధనలు – మెళకువలు అనే అంశంపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. కాగా, డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి, సైన్స్ ఆఫీసర్ చలపతిరాజు, ఏఎంఓ రాజశేఖర్, జూలూరుపాడు ఎంఈఓ జుంకీలాల్, కాకర్ల హైస్కూల్ హెచ్‌ఎం సంజీవరావు.. సంపత్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలను వెలికితీయాలి


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీడీ

కరకగూడెం: ఉపాధ్యాయులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని భద్రాచలం ఐటీడీఏ డీడీ మణెమ్మ హెచ్చరించారు. ఆమె బుధవారం మండలంలోని చిరుమళ్ల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లు, వంటగది, మరుగుదొడ్లు, డార్మెటరీ తరగతి గదులను పరిశీలించారు.. విద్యార్థుల్లో సామర్థ్యాలను వెలికితీయాలని, నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏటీడీఓ అశోక్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి


మాట్లాడుతున్న రేగా కాంతారావు

భద్రాచలంటౌన్: రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు సూచించారు. పట్టణంలో బుధవారం జరిగిన పార్టీ జనరల్‌బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్‌కు అధికారం ఉన్నా, లేకపోయినా ప్రజల పక్షాన నిలబడుతుందని తెలిపారు. భద్రాచలం నియోజకవర్గ సమస్యలపై బీఆర్‌ఎస్ నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు. తొలుత పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మానె రామకృష్ణ, రావులపల్లి రాంప్రసాద్, జానీ, రాముడు తదితరులు పాల్గొన్నారు.

జీడిపల్లిలో మరో పోలీస్ క్యాంపు


క్యాంపును ప్రారంభిస్తున్న సీఆర్‌పీఎఫ్ అధికారులు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, దంతెవాడ, సుకుమా జిల్లాల్లోని అటవీ ప్రాంతాల్లో క్యాంపులు ఏర్పాటవుతున్నాయి. ఇప్పటికే సరిహద్దులో 39కి పైగా క్యాంపులు ఏర్పాటవ్వగా తాజాగా బీజాపూర్ జిల్లా పామేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని జీడిపల్లిలో క్యాంపును ఏర్పాటు చేశారు. సీఆర్‌పీఎఫ్ 228 బెటాలియన్ క్యాంపును ఏర్పాటు చేయగా పరిసర ప్రాంతాల్లో సుమారు 2 వేల మందికి పైగా డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా, బస్తర్ ఫైటర్స్ పహారా కాస్తూ కూంబింగ్ నిర్వహిస్తున్నారు. జీడిపల్లి ప్రాంతం గతంలో మావోయిస్టులకు పెట్టని కోట. ఈ ప్రాంతం సమీపంలో గతంలో గల కొరగట్ట, కంచాల, పువ్వర్తి ప్రాంతాల్లో ఎదురుకాల్పుల ఘటనలు చోటుచేసుకోగా, పదుల సంఖ్యలో మావోయిస్టులు మృతి చెందారు.

పేకాట స్థావరంపై దాడి

బూర్గంపాడు: నాగినేనిప్రోలు రెడ్డిపాలెం సమీపంలో పేకాట స్థావరంపై బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. బూర్గంపాడు ఎస్‌ఐ రాజేశ్ కథనం ప్రకారం.. నాగినేనిప్రోలు గ్రామసమీపంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.29 వేల నగదు, మూడు సెల్‌ఫోన్లు, నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. మరో నలుగురు పరారయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,144

శిశువుకు ఆయువు..

- అత్యవసర వైద్య సేవలకు ఊతం..
- 108 నియోనేటల్ ద్వారా శిశువులకు అత్యవసర వైద్యం
- వాహనంలో ప్రత్యేక ఐసీయూ, ఇతర విభాగాలు
- శిక్షణ పొందిన సిబ్బంది పర్యవేక్షణలో ఆస్పత్రులకు తరలింపు



నియోనేటల్ 108లో శిశువుకు అత్యవసర వైద్యం అందిస్తున్న సిబ్బంది (ఇన్‌సెట్) ప్రాణాపాయస్థితిలో ఉన్న శిశువుకు వెంటిలేటర్ ద్వారా చికిత్స..

ఖమ్మంవైద్యవిభాగం: పుట్టిన బిడ్డకు అనారోగ్య సమస్యలు వస్తే గతంలో తీవ్ర ఇబ్బందులు ఏర్పడేవి. అర్ధరాత్రి, అపరాత్రి అయినా హుటాహుటిన జిల్లా కేంద్రంలోని ఆస్పత్రులకు తరలించేందుకు నానా అగచాట్లు పడేవారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో పుట్టిన శిశువులను ఆ తల్లులు వారి ఇళ్లకు తీసుకెళ్లిన తర్వాత తిరిగి ఆ శిశువుకు ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమైతే గతంలో చాలా ఇబ్బందులు పడేవారు. అలాగే, గ్రామాల్లో ఇంటి వద్ద పుట్టిన శిశువులకు అనారోగ్య సమస్యలు వస్తే కూడా తీవ్ర ఇబ్బందులే ఉండేవి. కానీ, గత ఏడాది నియోనేటల్ 108 వాహనం అందుబాటులోకి వచ్చాక ఆ ఇబ్బందులు పూర్తిగా తొలగిపోయాయి. క్షేత్రస్థాయిలో ఏ గ్రామంలో ఉన్నా నియోనేటల్ 108 నంబర్‌కు ఫోన్ చేస్తే వెంటనే అక్కడకు చేరుకొని ప్రాథమిక చికిత్స అందించి దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి కానీ, జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి గానీ తరలిస్తున్నారు. దీంతో ఆ శిశువుకు త్వరగా వైద్య సేవలు అందుతున్నాయి. ఇప్పటి వరకు ఈ వాహనాల ద్వారా ఉమ్మడి జిల్లాలో అనేక మంది శిశువుల ప్రాణాలు నిలిపారు.

గతేడాది షురూ..

నియోనేటల్ కేర్ అంబులెన్స్ సేవలను గత ఏడాది ఆగస్టు 21న రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాకు రెండు వాహనాలు కేటాయించగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెంలో ఒక్కొక్క వాహనం ద్వారా సేవలు అందిస్తున్నారు. నవజాత శిశువు సంరక్షణలో భాగంగా ఈ వాహనాలను అందుబాటులోకి తెచ్చారు. అత్యవసర వైద్యం అవసరమైన వందలాది మంది శిశువుల ప్రాణాలు రక్షించడంలో వాహన సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,152 మంది శిశువులకు వాహనాల ద్వారా చికిత్స అందించారు. భద్రాద్రి కొత్తగూడెంలో 636, ఖమ్మం జిల్లాలో 516 మంది శిశువులకు అత్యవసర వైద్య సేవలు అందించి వారి ప్రాణాలు నిలిపారు. నవజాత శిశువులకు అత్యవసర వైద్య సేవలు అందిస్తూ నియోనేటల్ కేర్ అంబులెన్స్‌లు వారి పాలిట సంజీవనిలా నిలుస్తోంది. ముఖ్యంగా ఈ వాహనాలు ఆర్థిక స్థోమత లేని కుటుంబాలకు వరంలా సమకూరాయి. పైసా ఖర్చు లేకుండా అక్కడికక్కడే అత్యవసర వైద్యం అందించటంతో పాటు దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించి ఇంకా మెరుగైన వైద్యం అందేలా చూస్తున్నారు. ఈ వాహన సేవల పట్ల జిల్లాలోని నవజాత శిశువుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

వాహనంలోనే మినీ ఐసీయూ

అప్పుడే జన్మించిన శిశువు నుంచి 30 రోజుల లోపు వయస్సు పిల్లలను నియోనేటల్‌గా పరిగణిస్తారు. ఈ వయస్సున్న వారి కోసమే నియోనేటల్ అంబులెన్స్‌లు అందుబాటులోకి తెచ్చారు. ఈ వయస్సు ఉన్న శిశువులకు ఎప్పుడు ఏ సమస్య వస్తుందో తెలియని పరిస్థితి ఉంటుంది. దీనికి తోడు పట్టణానికి దూరంగా ఉన్న గ్రామాల్లోని శిశువులకు అత్యవసర వైద్యం అందించాల్సి వచ్చినప్పుడు.. తరలించటానికి చాలా సమయం పడుతుంది. అప్పుడు ప్రాణాపాయం కూడా సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా అప్పుడే జన్మించిన శిశువుకు శ్వాస, గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. దీంతో శిశువులను సకాలంలో పెద్దాస్పత్రులకు తరలించడంతో పాటు మార్గమధ్యలో వారికి చికిత్స అందించేందుకు వాహనంలో కృత్రిమ శ్వాస అందించే వెంటిలేటర్, ఆక్సిజన్, నాడి, రక్తపోటును పరీక్షించే మానిటర్, బయట ఉండి శ్వాస అందించే బ్యాగ్‌మాస్క్, డివైజ్, శిశువును వెచ్చగా ఉంచే బేబీ వార్మర్ లాంటి పరికరాలను ఏర్పాటు చేశారు. ఒక్కో వాహనంలో నిరంతరం ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, పైలట్ అందుబాటులో ఉంటారు.

నియోనేటల్ 108 వాహనం ద్వారా జిల్లాల వారీగా అందించిన సేవలు

నెల	ఖమ్మం	భద్రాద్రి కొత్తగూడెం
ఆగస్టు-2023	14	09
సెప్టెంబర్	19	39
అక్టోబర్	31	42
నవంబర్	27	28
డిసెంబర్	39	39
జనవరి-2024	29	32
ఫిబ్రవరి	28	39
మార్చి	42	29
ఏప్రిల్	39	41
మే	28	51
జూన్	24	40
జూలై	28	35
ఆగస్టు	43	57
సెప్టెంబర్	45	61
అక్టోబర్	48	57
నవంబర్ (ఇప్పటివరకు)	32	37

శిశు మరణాలు చాలా తగ్గాయి



ఈ వాహనాలు అందుబాటులోకి వచ్చాక శిశు మరణాల రేటు చాలా తగ్గుముఖం పట్టింది. ఏడాదికి పైగా నిర్విరామంగా సేవలు అందిస్తూ వందలాది మంది శిశువులకు వైద్య సేవలు అందించాం. అనారోగ్యంతో జన్మించిన శిశువులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు శిక్షణ పొందిన సిబ్బంది పర్యవేక్షణలో పెద్దాస్పత్రులకు తరలిస్తున్నాం. క్షేత్రస్థాయి నుంచి జిల్లా కేంద్ర ఆస్పత్రులకు, అక్కడ కూడా ఇబ్బందులు తలెత్తితే వెంటనే హైదరాబాద్ నీలోఫర్ తరలిస్తున్నాం. వాహనంలో ఉన్న వెంటిలేటర్ సాయంతో కృత్రిమ శ్వాస, నియోనేటల్ వార్మర్ సాయంతో తల్లిగర్భంలో ఉన్న ఉష్ణోగ్రతను అందిస్తూ ప్రాణాలు రక్షిస్తున్నాం.

–బి.నాగేందర్, 108 ఉమ్మడి జిల్లా మేనేజర్

నాణ్యమైన ఆహారం అందించాలి

- డీఈఓ వెంకటేశ్వరాచారి


మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరాచారి

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి సూచించారు. బుధవారం పీఎం పోషణ్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో వంట వండే వర్కర్లకు పాత కొత్తగూడెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయిలో వంటల పోటీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ జిల్లాస్థాయి పోటీలకు 23 మండలాల నుంచి 23 మంది హాజరయ్యారని తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు నాణ్యమైన వంట సరుకులతో, రుచికరమైన వంటలను తయారు చేశారని అన్నారు. ఇదే విధంగా పాఠశాలలో కూడా శుచి శుభ్రతతో పాటు, రుచికరమైన, నాణ్య మైన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు ఎస్‌కే సైదులు, ఎస్.సతీష్ కుమార్, శ్యామల, ఆస్మా, రాంబాయి, సిబ్బంది నవీన్, మోహన్ పాల్గొన్నారు.

నూతన ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం ఎన్నిక

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం జిల్లా కమిటీ ఎన్నిక బుధవారం బాబూక్యాంపు ప్రభుత్వ పాఠశాలలో జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా భూక్యా తారాచంద్, ప్రధాన కార్యదర్శిగా సపావట్ లాల్‌సింగ్‌ను రాష్ట్ర అధ్యక్షులు కాసం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కోశాధికారిగా భాస్కర్ రావు, అసోసియేట్ అధ్యక్షులుగా తబిత, సంధ్యారాణి, యం.గుణిరామ్, ఉపాధ్యక్షులుగా మోహన్ రావు, దేవీలాల్, బాసు, లాల్‌తో పాటుగా కార్యదర్శులు, గౌరవ అధ్యక్షులు, జిల్లా కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు.

రైతులకు చట్టాలపై అవగాహన ఉండాలి

మణుగూరు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సూరిరెడ్డి


సదస్సులో మాట్లాడుతున్న మణుగూరు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సూరిరెడ్డి

అశ్వాపురం: రైతులు వ్యవసాయ, భూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మణుగూరు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సూరిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామ రైతువేదికలో బుధవారం నిర్వహించిన న్యాయ చైతన్య సదస్సులో వారు మాట్లాడారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసినప్పుడు బిల్లులు తీసుకోవాలన్నారు. ఏదైనా ఇబ్బందులు వస్తే ఆ రశీదు ఆధారంగా న్యాయం పొందవచ్చని చెప్పారు. ధాన్యం విక్రయాల్లో సమస్యలు ఏర్పడితే న్యాయ సేవా సంస్థను సంప్రదించాలని కోరారు. రైతులు భూ సమస్యలు, ధాన్యం కొనుగోలు సమస్యలను న్యాయమూర్తికి వివరించారు. నెల్లిపాక రెవెన్యూలో 190 సర్వే నంబర్ భూములకు పట్టాలు ఇవ్వడంలేదని మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి విన్నవించగా, హైకోర్టు ద్వారా సమస్య పరిష్కరించుకోవాలని న్యాయమూర్తి సూచించారు. ఈ సమావేశంలో ఏడీఏ తాతారావు, ఏఓ సాయిశంతన్‌కుమార్, సీఐ అశోక్‌రెడ్డి, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కమటం సురేష్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డుపై మహిళల ధర్నా


ధర్నా చేస్తున్న మహిళ, ఆమె బంధువులు

దమ్మపేట: వేధింపులకు గురిచేస్తున్న తన భర్తపై దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదుపై విచారణ జరిపి, తనకు న్యాయం చేయాలని కోరుతూ వివాహితతో పాటు ఆమె బంధువులు బుధవారం ధర్నా చేశారు. దమ్మపేట గ్రామం, అర్బన్‌కాలనీకి చెందిన షేక్ ఫాతిమాకు కొత్తగూడెంనకు చెందిన షేక్ అస్మత్‌తో 2015లో వివాహమైంది. కొంతకాలంగా వీరి మధ్య మనస్పర్ధల కారణంగా నెల రోజుల కిందట ఫాతిమా దమ్మపేటలోని తన పుట్టింటికి వచ్చింది. ఆమె తనకు న్యాయం చేయాలని కోరుతూ దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన ఫిర్యాదుపై ఇంకా కేసు నమోదు చేయలేదంటూ, బుధవారం ఆమె తన తల్లి మైబు, బంధువులతో కలిసి పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై ధర్నాకు దిగింది. స్పందించిన ఎస్ సాయికిశోర్‌రెడ్డి వారికి న్యాయం చేస్తానని సర్దిజెప్పి, ఆందోళనను విరమింపజేశారు. ఎస్‌ఐని వివరణ కోరగా.. షేక్ ఫాతిమా, అస్మత్ దంపతులు ముస్లిం మత పెద్దల సమక్షంలో ఖులా ఉత్తర్వుల ప్రకారం గత నెల (అక్టోబర్) 22న విడాకులు తీసుకున్నారని ప్రాథమిక విచారణలో తెలిసిందని, ఈ కారణంగా బాధితురాలి ఫిర్యాదుపై కేసు నమోదులో కొంత జాప్యం జరిగిన మాట వాస్తవమేనని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయనున్నామని ఎస్‌ఐ వివరించారు.

సామర్థ్యాల పెంపుకోసమే ఉద్దీపకం


పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు, ఐటీడీఏ పీఓ రాహుల్

మణుగూరుటౌన్: విద్యార్థులు గణితంలో, ఆంగ్లంలో చదవడం రాయడం లాంటి సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉద్దీపకముల పుస్తకం రూపొందించారని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని గుట్టమల్లారంలోని జీపీఎస్ పాఠశాలలో ఐటీడీఏ ద్వారా రూపొందించిన ఉద్దీపకం ఇంగ్లిష్, గణితం విద్యార్థుల వర్క్‌బుక్‌లను ఐటీడీఏ పీఓ రాహుల్‌తో కలిసి విద్యార్థులకు అందజేశారు. గిరిజన విద్యార్థుల బలోపేతానికి ఈ ఉద్దీపకాలు ఎంతో ఉపకరిస్తాయన్నారు. సంబంధిత ఉపాధ్యాయులు తప్పనిసరిగా పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు. అనంతరం పీఓ మాట్లాడుతూ.. జీపీఎస్ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలు ఇంగ్లిష్‌లో రాయడం చదవడం గణితంలో చతుర్విధ ప్రక్రియలు చేయడంలో వెనుకబడుతున్నట్లు గ్రహించామని, నిష్ణాతులైన ఉపాధ్యాయుల చేత 100 రోజుల ప్రణాళిక ద్వారా ఈ ఉద్దీపకాలు రూపొందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి మణెమ్మ, ఏటీడీఓ అశోక్‌కుమార్, ఎంఈఓ స్వర్ణ జ్యోతి, ఎస్‌సీఆర్‌పీ గాంధీ, తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్, హెచ్‌ఎం ముత్తయ్య, కార్యదర్శి దుర్గా భవానీ తదితరులు ఉన్నారు.

పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆత్మహత్యాయత్నం


దేవేందర్‌ను అడ్డుకుంటున్న ఎస్‌ఐ సుమన్

పాల్వంచ: పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఓ వ్యక్తి బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పట్టణ పోలీస్‌స్టేషన్‌కు ఓ వ్యక్తి వచ్చి కానిస్టేబుల్‌ను పిలిచి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని పెద్దగా కేకవేశాడు. మద్యం బాటిల్ పగుల గొట్టి కడుపులో పొడుచుకునే ప్రయత్నం చేశాడు. ఎస్‌ఐ సుమన్, సిబ్బంది అడ్డుకున్నారు. తన పేరు దేవేందర్ అని, భార్య ఎనిమిదేళ్ల కిందట వదిలి వెళ్లిందని, గోదావరిఖని నుంచి భద్రాచలం రామాలయాన్ని దర్శించుకునేందుకు వచ్చానని, దర్శనం అనంతరం చనిపోవాలని నిర్ణయించుకున్నానని చెప్పాడు. ఎస్‌ఐ సుమన్‌ను వివరణ కోరగా భార్య వదిలిపోవడతో చనిపోవాలని మద్యం బాటిల్‌తో పొడుచుకోబోయాడని, స్వల్ప గాయం కావడంతో వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించి, కౌన్సెలింగ్ ఇచ్చి పంపించామని చెప్పారు.

ఉద్యమ నేతకు అశ్రు నివాళి

- సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్ గుండెపోటుతో మృతి
- సంతాపం తెలిపిన డిప్యూటీ సీఎం, మంత్రులు, నాయకులు
- స్వగ్రామంలో రేపు అంత్యక్రియలు


ప్రసాద్ భౌతికకాయంపై అరుణపతాకం కప్పుతున్న పువ్వాడ నాగేశ్వరరావు, బాగం హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ సారథి, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ (64) బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. ఉదయం వాకింగ్ చేస్తుండగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలారు. స్నేహితులు ప్రాథమిక చికిత్స అందించేలోపే ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ప్రసాద్ మృతదేహాన్ని ప్రజలు, అభిమానుల సందర్శనార్థం పార్టీ జిల్లా కార్యాలయంలో ఉంచారు. అమెరికాలో ఉంటున్న ప్రసాద్ కుమారుడు ఖమ్మం చేరుకున్న తర్వాత భౌతికకాయాన్ని ఆయన స్వగ్రామమైన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం రంగాపురం గ్రామానికి తరలిస్తారు. శుక్రవారం అక్కడే అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

రాజకీయ వర్గాల్లో దిగ్భ్రాంతి..

పోటు ప్రసాద్ అకాల మరణం జిల్లా రాజకీయ వర్గాలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన మరణ వార్త తెలియగానే ప్రజలు, అభిమానులు పెద్ద సంఖ్యలో సీపీఐ కార్యాలయానికి చేరుకున్నారు. పార్టీ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పోటు మృతదేహంపై అరుణపతాకం ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ జిల్లా కమ్యూనిస్టు ఉద్యమం మంచి నేతను కోల్పోయిందని అన్నారు. జిల్లా కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటన్నారు. మృతదేహాన్ని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐ జాతీయ సమితి సభ్యులు చాడ వెంకటరెడ్డి, భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబిర్‌పాషా, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర నాయకులు ఎస్.వీరయ్య, పి.సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు గుర్రం అచ్చయ్య, జి.రామయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, ఆవుల అశోక్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు. కాగా, డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీలు రేణుకాచౌదరి, వద్దిరాజు రవిచంద్ర, రామసహాయం రఘురాంరెడ్డి, సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, సంగీత దర్శకులు వందేమాతరం శ్రీనివాస్ సంతాపం తెలిపారు.

నల్లగొండలో జననం.. ఖమ్మంలో ఉద్యమం..

ఉమ్మడి నల్లగొండ జిల్లా గరిడేపల్లి మండలం రంగాపురం(వెలిదండ) గ్రామంలో 1960 సెప్టెంబర్ 1న పోటు రాఘవయ్య, సక్కుబాయి దంపతులకు ప్రసాద్ జన్మించారు. ఆయన నాయనమ్మ యర్రమ్మ కమ్యూనిస్టు ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. ఆమె వారసత్వాన్ని అందుకున్న రాఘవయ్య సాయుధ పోరాటంలో వీరోచిత పాత్ర నిర్వహించారు. ప్రసాద్ కూడా విద్యార్థి దశ నుంచే కమ్యూనిస్టు భావజాలాన్ని వంటపట్టించుకున్నారు. ఏఐఎస్‌ఎఫ్‌లో చురుకైన పాత్ర నిర్వహిస్తూ ఖమ్మం సిద్దారెడ్డి కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర నాయకునిగా పనిచేశారు. ఆ తర్వాత సుదీర్ఘ కాలంపాటు ట్రేడ్ యూనియన్ రంగంలో పనిచేస్తూ రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ సమితి సభ్యుడిగా పనిచేశారు. 2020 ఫిబ్రవరి 18న సీపీఐ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన ప్రసాద్ 2022 ఆగస్టులో వైరాలో జరిగిన జిల్లా మహాసభలో రెండోసారి ఎన్నికయ్యారు. ఆయన సోదరి పోటు కళావతి మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలుగా పనిచేసి ప్రస్తుతం జిల్లా పార్టీ కార్యవర్గసభ్యులుగా ఉన్నారు.

సర్వే వివరాలు గోప్యంగా ఉంచాలి


సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ రాహుల్

పినపాక: గ్రామ గ్రామాన తిరిగి సర్వే చేసి సేకరించిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను గోప్యంగా ఉంచాలని ఐటీడీఏ పీఓ రాహుల్ ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని పినపాక రైతు వేదికలో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వే వివరాల నమోదును ఆయన పరిశీలించారు. పూర్తి సమాచారాన్ని గోప్యంగా ఉంచాలని, ఎటువంటి తప్పులు జరిగినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం పినపాక ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించారు. నూతన భవనాన్ని త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, వైద్యాధికారిణి దుర్గాభవాని అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న బాలుడు మృతి


వివేక్ (ఫైల్)

ఇల్లెందురూరల్: ఇద్దరు కుమారులను ప్రయోజకులను చేయాలన్న దృఢ సంకల్పంతో పని కోసం ఆ దంపతులు స్వగ్రామం వీడి పట్నం బాటపట్టారు. ఇంతలోనే ఇద్దరు కుమారుల్లో ఒకరిని విధి బలితీసుకుంది. మండలంలోని చల్లసముద్రం గ్రామపంచాయతీ వేములవాడ గ్రామానికి చెందిన నక్క గోపి, సునీత దంపతులకు వివేక్ (11), వినయ్ కవల పిల్లలు. వారిని తీసుకొని ఏడాది కిందట హైదరాబాద్ చేరుకున్నారు. మౌలాలిలో నివాసం ఉంటూ అక్కడే గోపి సుతారి మేస్త్రిగా, సునీత కూలీగా పనులు చేస్తున్నారు. ఈ నెల 25న కుమారుడు వివేక్ డాబాపైకి ఎక్కి గాలిపటం ఎగురవేస్తూ ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. స్థానికులు అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వివేక్ అంత్యక్రియలు వేములవాడలో నిర్వహించారు.

మెట్ల పైనుంచి పడి వ్యక్తి...

పాల్వంచరూరల్: ప్రమాదవశాత్తు మెట్ల పైనుంచి జారి పడి వ్యక్తి మృతిచెందిన ఘటన అంబేడ్కర్‌కాలనీలో చోటుచేసుకుంది. మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామ పంచాయతీలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన వ్యవసాయ కూలీ స్వామి (40) బుధవారం తెల్లవారుజామున డాబా పైకి ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. తీవ్రంగా గాయపడటంతో స్వామిని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య సునీత ఉన్నారు.

శతాధిక వృద్ధురాలు...


తేజాబాయిపాసీ (ఫైల్)

ఇల్లెందు: పట్టణంలోని 14 నంబర్ బస్తీకి చెందిన శతాధిక వృద్ధురాలు తేజాబాయిపాసీ(101) మంగళవారం మృతి చెందారు. 15వ వార్డుకు చెందిన మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సుదర్శన్ కోరీ కథనం ప్రకారం.. తేజాబాయి తులసీ వారం రోజుల కిందట అనారోగ్యం పాలైనట్లు తెలిపారు.

ఎక్కడికీ పోలేదు.. డెన్‌లోనే ఉన్నా

సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ



సాక్షి, హైదరాబాద్: 'నేను ఎక్కడికీ పోలేదు. డెన్‌లోనే ఉన్నా'అని ప్రముఖ సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కేసు నమోదైన నేపథ్యంలో ఆయన అజ్ఞాతంలోకి వెళ్లారని ప్రచారం కావటంతో బుధవారం ఆర్జీవీ హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. 'నా వృత్తి సినిమాలు తీయటం. అనేక రకాల నేపథ్య కథలతో సినిమాలు తీస్తూ వచ్చాను. నా కెరీర్‌లో అత్యధికం నిజ జీవిత కథల ఆధారంగానే వచ్చాయి. సినిమాల్లో కొన్ని పాత్రలను వ్యంగ్యంగా చూపించాల్సి వస్తుంది. అంత మాత్రానికే కేసులు పెట్టి, అరెస్ట్ చేస్తామంటే అంతకు మించిన దారుణం మరొకటి ఉండదు'అని వర్మ అన్నారు. ఉద్దేశపూర్వక కేసులకు భయపడేది లేదని, అన్నింటికీ కాలమే సమాధానం చెబుతుందని పేర్కొన్నారు.

నేడు వైఎస్ జగన్ మీడియా సమావేశం

సాక్షి, అమరావతి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గురువారం పాత్రికేయ సమావేశం నిర్వహించనున్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సాయంత్రం 4 గంటలకు ఈ సమావేశం జరగనుంది.

కేంద్ర కార్యదర్శిగా ఏవీఎస్ రమేశ్‌చంద్రకు పదోన్నతి



సాక్షి, హైదరాబాద్: ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్)కు చెందిన డాక్టర్ ఏవీఎస్ రమేశ్ చంద్రకు కేంద్ర ప్రభుత్వ కార్యదర్శిగా పదోన్నతి లభించింది. కేంద్ర కార్యదర్శి హోదాలో విదేశీ వ్యవహారాల బాధ్యతలను రమేశ్‌చంద్ర పర్యవేక్షించనున్నారు. ఇప్పటికే ఆయన భారత రాయబారిగా తుర్కియే, ఉగాండా వంటి 10 దేశాల్లో సేవలందించారు. ఏపీ, తెలంగాణకు నోడల్ అధికారిగా విదేశీ వ్యవహారాలను కూడా ఏవీఎస్ చూశారు. నాగార్జునసాగర్ ఏపీఆర్‌జేసీలో ఇంటర్ చదివిన రమేశ్‌చంద్ర... ఏపీ అగ్రికల్చర్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. పలు డిగ్రీల్లో గోల్డ్ మెడల్ అందుకున్న ఆయన కేంద్ర కార్యదర్శిగా పదోన్నతి పొందడంపై బంధుమిత్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇవేం నేరారోపణలు?

ప్రముఖ న్యాయ కోవిదుడు, మాజీ అటార్నీ జనరల్ ముకుల్ రోహత్గీ

- కీలకమైన రెండు నేరారోపణల్లో అసలు అదానీల పేర్లే లేవు
- 'ఎఫ్‌సీపీఏ'ని ఉల్లంఘించారన్న నేరారోపణల్లో అదానీల పేర్లు లేవు
- అమెరికా 'డీఓజే' నేరారోపణలకు బలం చేకూర్చే విశ్వసనీయమైన ఆధారాలేవీ లేవు
- లంచం ఇవ్వటానికి ప్రయత్నించారని గానీ.. ఇచ్చారనిగానీ నిరూపించే కనీస సమాచారం లేదు
- ఆ నేరారోపణలన్నీ ఊహజనితమైనవే..
- అందుకు ఎలాంటి ఆధారాలూ లేవు..
- ఈ విషయాలను మీడియా గమనించాలి



సాక్షి, అమరావతి: సౌర విద్యుత్ ప్రాజెక్టుల సంబంధించి అదానీ గ్రూపు లంచాలు ఇచ్చేందుకు కుట్ర పన్నిందంటూ యూఎస్ ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్ (ఎఫ్‌సీపీఏ) కింద అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ (డీఓజే) కేసు నమోదు చేయడాన్ని ప్రముఖ న్యాయ కోవిదుడు, మాజీ అటార్నీ జనరల్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ తప్పుబట్టారు. 'డీఓజే' చేసిన నేరారోపణలకు బలం చేకూర్చే విశ్వసనీయమైన ఆధారాలు ఏవీ లేవని ఆయన స్పష్టం చేశారు. ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్ (ఎఫ్‌సీపీఏ)ను ఉల్లంఘించారనే విషయంలో అదానీలపై ఎలాంటి నేరారోపణలు లేవన్నారు. అలాగే న్యాయాన్ని అడ్డుకున్నారన్న నేరారోపణలో కూడా అదానీల పేర్లు గానీ వారి అధికారుల పేర్లు గానీ లేవని వెల్లడించారు. ఈ రెండు కీలకమైన నేరారోపణల్లో అదానీల పేర్లు లేవన్న సంగతిని అందరూ.. ముఖ్యంగా మీడియా గుర్తించాలని సూచించారు. బుధవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఏం చెప్పారంటే...

➤ యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ మోపిన నేరారోపణ పత్రాన్ని నేను చదివా. ఆయా వ్యక్తుల నిర్దిష్ట చర్యలపై అభియోగాలు మోపుతూ మన దేశంలో దాఖలు చేసే చార్జిషీట్ లాంటిది ఇది. నా లెక్క ప్రకారం మొత్తం ఐదు నేరారోపణలున్నాయి. ఇందులో మొదటి, ఐదో నేరారోపణలు మిగిలిన వాటికన్నా చాలా ముఖ్యమైనవి. అయితే ఒకటో నేరారోపణలోగానీ ఐదో నేరారోపణలోగానీ అదానీ, ఆయన మేనల్లుడు పేర్లు లేనే లేవు. ఆ నేరారోపణలు మన దేశంలో దాఖలు చేసే చార్జిషీట్ లాంటివి. అది లంచం కావచ్చు.. దొంగతనం కావచ్చు.. హత్య కావొచ్చు. మొదటి నేరారోపణలో ఇద్దరు అదానీల పేర్లు లేవు. ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్ (ఎఫ్‌సీపీఏ) కింద ఈ నేరారోపణలు చేశారు. ఎఫ్‌సీపీఏ అనేది మన దేశంలో అవినీతి నిరోధక చట్టం లాంటిది. మొదటి నేరారోపణ ఏమిటంటే.. ఎఫ్‌సీపీఏని ఉల్లంఘించేందుకు కుట్ర పన్నారన్నది. ఇందులో అదానీల పేర్లు లేవు. వారి అధికారుల పేర్లు ఉన్నాయి. రెండు, మూడు, నాలుగో ఆరోపణలు సెక్యూరిటీలు, బాండ్లకు సంబంధించినవి. ఈ నేరారోపణల్లో అదానీలు, వారి అధికారుల పేర్లున్నాయి. ఐదవదైన చివరి నేరారోపణ చాలా ముఖ్యమైనది. ఈ నేరారోపణ న్యాయానికి ఆటంకం కలిగించారన్నది. ఇందులో అదానీల పేర్లు లేవు. వారి అధికారుల పేర్లు కూడా లేవు. అసలు ఎవరు ఎవరికి లంచం ఇచ్చారు..? ఎంత లంచం ఇచ్చారు..? ఎలా ఇచ్చారు... లాంటి వివరాల్లేవ్..!

➤ ఏది ఏమైనప్పటికీ ఈ ఆరోపణలపై అదానీలు తమకు తోచిన విధంగా స్పందిస్తారు. అలాగే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లపై సైతం వారు స్పందిస్తారు. నేను వారి స్పందనలను చూడలేదు. డీవోజే చార్జిషీట్‌ను పరిశీలించిన తరువాత నేను వ్యక్తిగతంగా వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలివి. ఓ చార్జిషీట్‌లో ఫలానా వ్యక్తులు ఫలానా పనులు చేశారు.. ఫలానా వ్యక్తులు ఫలానా వారికి లంచం ఇచ్చారు లాంటి వివరాలేవీ లేకపోవడం ఆందోళన కలిగించే విషయం. అదానీలు సౌర విద్యుత్ ప్రాజెక్టుల నిమిత్తం భారతదేశ వ్యక్తులకు, సంస్థలకు లంచం ఇవ్వజూపారన్నది ప్రధాన నేరారోపణ. అయితే ఆ నేరారోపణల్లో లంచం ఇచ్చేందుకు ప్రయత్నించారని ఉందే కానీ.. ఎవరికి లంచం ఇచ్చారు? ఎలా లంచం ఇచ్చారు? ఇందులో అదానీ గ్రూపు అధికారుల ప్రత్యక్ష ప్రమేయం ఉందా? ఎంత లంచం ఇచ్చారు? ఏ కాంట్రాక్ట్ కోసం లంచం ఇచ్చారు? అధికారులు ఏ గ్రూపునకు చెందిన వారు తదితర వివరాలేవీ కనీస స్థాయిలో కూడా లేవు. ఇందుకు సంబంధించి ఒక్కరి పేరు కూడా ఆ నేరారోపణల్లో లేదు. ఇలాంటి నేరారోపణలపై ఎవరైనా ఎలా స్పందిస్తారు? ఆ నేరారోపణల్లో ఎక్కడా కూడా ఇండియాలో లంచాలు ఇచ్చినట్లు లేదు. లంచం ఇచ్చేందుకు కుట్ర పన్నారన్నదే ప్రధాన నేరారోపణ. కానీ ఇందుకు ఎలాంటి ఆధారాలు లేవు. ఈ వ్యవహారంలో వారు (అదానీలు) అమెరికాలోని న్యాయవాదుల సలహాలు తీసుకుంటారని భావిస్తున్నా.

లంచం ఇవ్వాలని చూశారన్న ఆరోపణ మినహా అందుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేవు. అందువల్ల ఆ నేరారోపణలన్నీ కూడా ఊహాజనితమైనవే. మరోసారి చెబుతున్నా.. 1, 5వ నేరారోపణల్లో అదానీల పేర్లు లేవు.

'సోలార్' లంచాలు.. ఊహాగానాలే

▶ మొదటి పేజీ తరువాయి

దానికి ఎలాంటి సాక్ష్యాధారాలూ చూపలేదని.. లోతుగా పరిశీలిస్తే ఇవన్నీ కేవలం ఊహాగానాలేనని స్పష్టమవుతోందన్నారు. ఇక ఈ కేసులో అత్యంత కీలకమైన 1, 5వ నేరారోపణల్లో అదానీ గానీ ఆయన మేనల్లుడు పేర్లు గానీ లేనే లేవని చెప్పారు. 'ఎఫ్‌సీపీఏ'ని ఉల్లంఘించారన్న నేరారోపణల్లోగానీ.. న్యాయానికి ఆటంకం కలిగించారన్న ఆరోపణల్లోగానీ అదానీల పేర్లు లేవనే విషయాన్ని వారు తెరపైకి తెచ్చారు. కీలకమైన ఈ రెండు నేరారోపణల్లో అదానీల పేర్లు లేవనే విషయాన్ని ప్రధానంగా మీడియా సంస్థలు గుర్తించాలని సూచిస్తున్నారు. అసలు లంచం ఇవ్వటానికి ప్రయత్నించారనిగానీ.. ఇచ్చారనిగానీ నిరూపించే కనీస సమాచారం కూడా లేదని పేర్కొంటున్నారు. ఆ నేరారోపణల్లో ఎక్కడా కూడా ఇండియాలో లంచాలు ఇచ్చినట్లు లేదని.. లంచం ఇచ్చేందుకు కుట్ర పన్నారన్నదే ప్రధాన నేరారోపణ అని.. అయితే అందుకు ఎలాంటి ఆధారాలు లేవనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. ఈ నేపథ్యంలో అమెరికా 'డీఓజే' నేరారోపణలకు బలం చేకూర్చే విశ్వసనీయమైన ఆధారాలేవీ లేవని ఈ కేసులో న్యాయపరమైన అంశాలను విశ్లేషించిన న్యాయ కోవిదులు చెబుతున్నారు.

అదానీపై ఆరోపణలు... భారత్‌పై విదేశీ శక్తుల కుట్ర

- సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది మహేశ్ జఠ్మలానీ
- అది దేశాన్ని ఆర్థికంగా అస్థిరపరిచే యత్నం
- సౌర విద్యుత్ ప్రాజెక్టుల కోసం అదానీ గ్రూప్ భారత్‌లో అధికారులు, నేతలకు లంచాలిచ్చినట్టు డీఓజే అభియోగాల్లో స్పష్టంగా లేదు
- అందుకు ఒక్కటంటే ఒక్క ఆధారం కూడా చూపలేదు
- ఏ చట్టాలను ఉల్లంఘించారో ఒక్క అభియోగంలో కూడా లేదు

సాక్షి, అమరావతి: "అదానీ గ్రూప్‌పై అమెరికా న్యాయ శాఖ (డీఓజే) చేసిన ఆరోపణలు, మోపిన అభియోగాలు కేవలం ఊహాగానాలు. పూర్తిగా నిరాధారం. పైగా వాటిని కూడా పూర్తిగా వక్రీకరించి మరీ భారత ప్రజల ముందు పెట్టారు. అదికూడా సరిగ్గా పార్లమెంటు శీతాకాల సమావేశాలు మొదలయ్యే ముందే వాటిని బయట పెట్టడం వెనక భారీ దురుద్దేశాలు దాగున్నాయి. ఇది భారత్‌ను ఆర్థికంగా అస్థిరపరిచేందుకు, దేశ కార్పొరేట్ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసేందుకు చేసిన ప్రయత్నమే" అని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది మహేశ్ జఠ్మలానీ పేర్కొన్నారు. సౌర విద్యుత్ ప్రాజెక్టుల కోసం అదానీ గ్రూప్ భారత్‌లో అధికారులకు, నేతలకు లంచాలిచ్చినట్టు డీఓజే తన అభియోగాల్లో ఎక్కడా స్పష్టంగా పేర్కొనలేదని జఠ్మలానీ గుర్తు చేశారు. తాను కేవలం ఒక జాతీయవాదిగా వ్యక్తిగత హోదాలో మాత్రమే దీనిపై స్పందిస్తున్నట్టు చెప్పారు. అంతేగానీ అదానీలకు గానీ, వారి గ్రూప్‌నకు గానీ మద్దతుగా మాట్లాడటం లేదని స్పష్టం చేశారు. అమెరికాలో జో బైడెన్ సారథ్యంలోని డెమొక్రటిక్ ప్రభుత్వానికి చెందిన అధికార లాబీలు ఏడాదిన్నరగా మోదీ సర్కారుకు పూర్తి వ్యతిరేకంగా పని చేస్తున్నాయన్నారు. 'అదానీ' వివాదంపై బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

విశ్వసనీయత లేదని ట్రంప్ చెప్పారు..

"అది పూర్తిగా అమెరికాలో అదానీ గ్రీన్ కంపెనీ జారీ చేసిన బాండ్లకు సంబంధించిన అంశం. ఇన్వెస్టర్లకు సమాచారమే ఇవ్వకుండా బాండ్లు జారీ చేశారని, భారత్‌లో కాంట్రాక్టులు పొందేందుకు లంచాలు ఆశచూపిన విషయాన్ని దాచి అమెరికాలో పెట్టుబడుల సేకరణకు ప్రయత్నం చేశారని అభియోగాలు మోపారు. కానీ అందుకు ఒక్కటంటే ఒక్క ఆధారం కూడా చూపలేదు. పైగా ఈ ఉదంతానికి సంబంధించి భారత్‌లో ఏ చట్టాలను ఉల్లంఘించారో కనీసం ఒక్క అభియోగంలో కూడా పేర్కొనలేదు. కనీసం ఉల్లంఘించినట్టు కూడా చెప్పలేదు. భారత్‌లో అధికారులకు గానీ, ప్రజాప్రతినిధులకు గానీ అదానీ గ్రూప్ లంచమిచ్చినట్టు ఎక్కడా నిర్దిష్టంగా చెప్పలేదు కూడా. 'లంచాలిచ్చారు, లేదా ఇస్తామని వాగ్దానం చేశారు' అంటూ చాలా పదాల కూర్పులో చాలా తెలివిగా వ్యవహరించారు. కేవలం కుట్ర జరిగి ఉంటుందని అభిప్రాయపడ్డారేగానీ దానికి ఎలాంటి సాక్ష్యాధారాలూ చూపలేదు. పైగా ఆ కుట్రను అమలు చేశారని కూడా చెప్పలేదు. లోతుగా చూస్తే ఇవన్నీ కేవలం అమెరికా న్యాయ శాఖ ఊహాగానాలేనని అడుగడుగునా స్పష్టమవుతూనే ఉంది" అని జఠ్మలానీ స్పష్టం చేశారు. అమెరికాలో న్యాయ శాఖ అనేదే ఒక పెద్ద జోక్ అని, దానికి విశ్వసనీయతే లేదని ఆ దేశానికి కాబోయే అధ్యక్షుడైన డొనాల్డ్ ట్రంపే చెప్పారని గుర్తు చేశారు.



అమెరికా కంపెనీల ఆధిపత్యానికి అదానీ గండి

అదానీ ఎపిసోడ్ మొత్తాన్నీ భారత్‌పై బైడెన్ సర్కారు పన్నాగంలో భాగంగా జఠ్మలానీ అభివర్ణించారు. "భారత శత్రు దేశాలకు చెందిన పలు కంపెనీలతో పోటీ పడి విదేశాల్లో షిప్పింగ్ తదితర కాంట్రాక్టులను అదానీ చేజిక్కించుకుంది. ఇది కొందరికి చాలా కంటగింపుగా మారింది. అదానీలు గానీ, అదానీ గ్రీన్ కంపెనీ గానీ ఈ ఉదంతంలో భారత్‌లో ఏ అవకతవకలకూ పాల్పడలేదన్నది స్పష్టమవుతున్నా డీఓజే నిరాధార ఆరోపణలకు విలువనివ్వడం భారత ప్రయోజనాలకు ఏమాత్రం మంచిది కాదు" అని అభిప్రాయపడ్డారు. "గతంలో హిండెన్‌బర్గ్ ద్వారా కావచ్చు. ఇప్పుడు డీఓజే అభియోగాలు కావచ్చు. అదానీలపై ఆరోపణలు తెరపైకి వచ్చినప్పుడల్లా ఆ గ్రూపు ఆర్థికంగా భారీగా నష్టపోతూ వస్తోంది. ఈసారి ఏకంగా 2.4 బిలియన్ డాలర్లు నష్టపోయింది. పైగా హిండెన్‌బర్గ్ నివేదికైనా, డీఓజే అభియోగాలైనా పార్లమెంటు సమావేశాలకు సరిగ్గా రెండు రోజుల ముందు బయటికొచ్చాయి. ఇందులోకి కేంద్ర ప్రభుత్వాన్ని కూడా లాగే ప్రయత్నం చేస్తున్నారు. అదానీ గ్రూప్‌నకు ప్రధాని నరేంద్ర మోదీ బాగా సన్నిహితుడంటూ కాంగ్రెస్, విపక్షాలు చేస్తున్న ఆరోపణలు అందులో భాగమే. పలు అమెరికా కంపెనీల ఆధిపత్యానికి అదానీ గ్రూప్ గండికొట్టింది. ఆ దుగ్ధ డీఓజే ఆరోపణల వెనక స్పష్టంగా కనిపిస్తోంది. ఏ సాక్ష్యం లేకుండా కేవలం ఓ అభియోగ పత్రంపై ఆధారపడి నిరాధార ఆరోపణలు చేయడం కాంగ్రెస్ లాంటి పెద్ద పార్టీకి తగని పని" అని జఠ్మలానీ పేర్కొన్నారు. డీఓజే అభియోగాల ఆధారంగా పార్లమెంటులో కాంగ్రెస్ చేస్తున్నదంతా వట్టి రాద్ధాంతమేనన్నారు. రిటైల్ ఇన్వెస్టర్లకు తీవ్ర నష్టం చేకూరుస్తోందని ఆవేదన వెలిబుచ్చారు. డీఓజే ఆరోపించినట్టుగా అదానీ ఉదంతంలో భారత్‌లో తప్పుడు వ్యవహారాలు జరిగినట్టు విశ్వసనీయమైన సాక్ష్యాలంటూ ఉంటే కాంగ్రెస్ ముందుగా వాటిని ప్రజల ముందు పెట్టాలని జఠ్మలానీ డిమాండ్ చేశారు.

జిల్లా వార్తలు

పోరాటాలకు సిద్ధం కండి

ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఎస్.రావు



మాట్లాడుతున్న వి.ఎస్.రావు

సత్తుపల్లి(సత్తుపల్లి టౌన్): రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులపై తీవ్రమైన పనిభారం పెరిగిందని, యాజమాన్యం వేధింపులు ఎక్కువయ్యాయని, సమస్యల పరిష్కారం కోసం కార్మికులు పోరా టాలకు సిద్ధం కావాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఎస్.రావు పిలుపునిచ్చా రు. సత్తుపల్లిలోని కళాభారతి ఆడిటోరియంలో బుధవారం జరిగిన ఎస్‌డబ్ల్యూఎఫ్ ఖమ్మం రీజినల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. డబుల్ డ్యూటీలు చేయాలనే వేధింపులు ఆపాలని, కార్మికుల ఉద్యమాలపై ఆంక్షలు ఎత్తివేయాలని, కో–ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బ్రీత్ ఎనలైజర్ కేసుల్లో చట్టాన్ని అమలు చేయాలన్నారు. మహా లక్ష్మి పథకంతో వస్తున్న సమస్యల పరిష్కారానికి టిమ్ మిషన్లలో సాఫ్ట్‌వేర్ మార్చాలని కోరారు. అనంతరం రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుండు మాధవరావు, సహాయ కార్యదర్శిగా జె.వి.రామారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముందుగా పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు బాణాల రాంబాబు, ఎ.వెంకటేశ్వర్లు, జె.పద్మావతి, పర్వీన, పి.నర్సిరెడ్డి, డిపోల కార్యదర్శులు సీహెచ్‌వీ కృష్ణారెడ్డి, కె.వెంకన్న, జి.రోశయ్య, బి.బాలకృష్ణ, వి.జాకబ్, టి.సుధాకర్, ఉపేంద్రాచారి, నాగేశ్వరరావు, శ్యామ్యూల్, సరిత, జగన్నాథం, వెంకటయ్య, ప్రభాకర్, సైదారెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో రేపు వేలం

పాల్వంచరూరల్ : పెద్దమ్మతల్లి ఆలయ ప్రాంగణంలోని వ్యాపార సముదాయాల కేటాయింపునకు ఈనెల 29న టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ రజనీకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త కాంప్లెక్స్‌లోని 1, 4వ నంబర్ల షాపులకు వేలం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే వచ్చే ఏడాది జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు వస్తువుల సరఫరాకు సీల్డ్ టెండర్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. పూలదండలు, పూల సరఫరా, టికెట్ పుస్తకాలు, వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ప్రింట్ చేయడం, వస్త్రాలు, ఎలక్ట్రికల్ సామగ్రి, ప్లంబింగ్, స్టేషనరీ, పాలు, పెరుగు, కూరగాయలు, క్యారీ బ్యాగులు, లడ్డూ బాక్స్‌లు, ఫొటోఫ్రేమ్, లైటింగ్ ఏర్పాటు, శివాలయ ప్రతిష్ఠకు రుత్విక్‌లను సమకూర్చడం వంటి వాటికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి గలవారు శుక్రవారం ఉదయం 11 గంటల వరకు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

ఖాళీ స్థలాలు కబ్జా..!

- ఏ భూమైనా యథేచ్ఛగా ఆక్రమణలు
- అధికారులు ఏర్పాటు చేసిన బోర్డులు మాయం
- పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం



ప్రభుత్వ స్థలంగా రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు (ఫైల్)

వివాదాస్పదంగా ఉన్న స్థలం



ఖాళీ స్థలం కనిపిస్తే చాలు.. కొంతకాలం గమనించిన కబ్జాదారులు నిర్మాణాలు చేపడుతున్నారు. వీలైతే ఇతరులకు విక్రయిస్తున్నారు కూడా. ఆ స్థలం ప్రభుత్వానిదా.. ప్రైవేట్ వ్యక్తులదా అని చూడకుండా ఆక్రమించేస్తున్నారు. ఇదంతా తెలిసినా రెవెన్యూ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

– ఇల్లెందురూరల్

మాయమవుతున్న బోర్డులు..

గతంలో ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కావడంపై స్పందించిన అప్పటి రెవెన్యూశాఖ అధికారులు తక్షణ చర్యలకు ఉపక్రమించారు. వీఆర్వోలు, వీఆర్ఏలు అందుబాటులో ఉండడంతో సమగ్రంగా సర్వే చేయించి ప్రభుత్వ స్థలాలుగా నిర్ధారించి బోర్డులు ఏర్పాటు చేశారు. అంతేకాక వివాదాస్పద భూములను సైతం గుర్తించి బోర్డులను పాతారు. ఇలా సుదిమళ్ల గ్రామపంచాయతీ పరిధిలో జగదాంబగుంపు గ్రామ సమీపాన, గ్రామపంచాయతీ కార్యాలయ సమీపాన, సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ గురుకుల పాఠశాల సమీపాన, హెచ్‌పీ గ్యాస్ గోదాము వెనకాల, రొంపేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపాన ఇలా ఒకటేమిటి అనేక చోట్ల వేసిన బోర్డులు నేడు మాయమయ్యాయి. అంతేకాకుండా స్వయంగా ఆర్డీఓ స్థాయి ఉన్నతాధికారులు క్షేత్రపర్యటన చేసి పలు చోట్ల ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను గుర్తించి చర్యలకు ఉపక్రమించారు. ప్రభుత్వ స్థలాల్లో ఉన్న ఆక్రమణలను పూర్తిగా తొలగించారు. కానీ కాలక్రమంలో రాజకీయ ఒత్తిళ్లు, ఉన్నతాధికారుల ఉదాసీనత, రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోకపోవడం వంటి కారణాలతో పాతిన బోర్డులు కనిపించకుండాపోయాయి. బోర్డులు తొలగించిన చోట నిర్మాణాలు మళ్లీ ఊపందుకోవడంతో పాటు భూముల క్రయ విక్రయాలు కూడా జోరుగా సాగుతున్నాయి.

కొరవడిన భద్రత..

మండల, పట్టణ పరిధిలో అటవీశాఖకు సంబంధించిన భూములు కూడా అన్యాక్రాంతమవుతున్నాయి. పట్టణాలు, గ్రామాలకు సమీపంలో ఖాళీగా ఉన్న అటవీభూములలో దశాబ్దాల క్రితం పేదలు ఇళ్లను నిర్మించుకున్నారు. ఆయా ఇళ్ల మధ్యలో అక్కడక్కడ నేటికీ అటవీశాఖకు సంబంధించిన ఖాళీ స్థలాలు ఉన్నాయి. అవి కూడా ఆక్రమణకు గురవుతున్నా.. అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. అటవీశాఖ అధికారుల ఉదాసీనత ఫలితంగా సర్వే నంబర్ 603 పరిధిలో అటవీభూములు యథేచ్ఛగా ఆక్రమణలకు గురవడంతోపాటు క్రయ విక్రయాలు కూడా జోరుగా జరుగుతున్నాయి.

హద్దులు తేల్చడంలో నిర్లక్ష్యం..

మండల, పట్టణ పరిధిలో అటవీ, రెవెన్యూ శాఖల మధ్య సరిహద్దులు, ఎక్కడ ఎవరి భూములు, ఎంత విస్తీర్ణంలో ఉన్నాయి, వాటి భౌతిక స్థితి ఎలా ఉందన్న విషయాలు దశాబ్దాలుగా ప్రశ్నార్థకంగా ఉండిపోతోంది. పట్టణ నడిబొడ్డున గోవింద్‌సెంటర్‌లో లీజు గడువు ముగియడంతో సింగరేణి సంస్థ సదరు భూమిని రెవెన్యూశాఖకు అప్పగించింది. 20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూమిలో అప్పటికే అటవీశాఖ పలు భవనాలు నిర్మించింది. రహదారి నిర్మాణంలో అటవీశాఖ భూమిని కోల్పోవడంతో రెవెన్యూశాఖ ప్రత్యామ్నాయంగా గోవింద్‌సెంటర్‌లో అప్పటికే అటవీశాఖ అధీనంలో ఉన్న 20 ఎకరాల విస్తీర్ణంలో 12 ఎకరాలను రెవెన్యూశాఖ అధికారులు అటవీశాఖకు అప్పగించారు. మిగిలిన 8 ఎకరాలను స్వాధీనం చేసుకోకుండా రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆక్రమణలను ప్రోత్సహించేలా ఉన్నాయి. ఇలాంటి భూములు పట్టణ, మండల పరిధిలో అనేకం ఉన్నా రెవెన్యూ అధికారుల వైఖరి కారణంగా ఆక్రమణదారుల పరం అవుతున్నాయి.

ప్రైవేట్ భూములకూ కొరవడిన రక్షణ

పడావుపడి భూములు ఖాళీగా కనిపిస్తే చాలు ఆక్రమణదారులు పెట్రేగిపోతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యాన సుదిమళ్ల గ్రామపంచాయతీ బస్టాప్ సమీపాన ఓ ముస్లింకు చెందిన భూమి కొంతకాలంగా ఖాళీగా ఉంటోంది. సదరు భూమిని ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమణకు ప్రయత్నించి నిర్మాణ సామగ్రిని తరలించారని ఆరోపిస్తూ భూమి యజమానులు రెవెన్యూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇలా వివాదాస్పందంగా ఉన్న భూములు మండలంలో కోకొల్లలు ఉండడంతో భూముల ఆక్రమణ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.

ఆక్రమణలను ఉపేక్షించం..



ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల వివరాలు సేకరిస్తున్నాం. భూములు ఆక్రమించిన వారికి నోటీసులు ఇస్తాం. నిర్మాణంలో ఉన్నవాటిని నిలుపుదల చేయిస్తాం. ప్రైవేట్ భూముల ఆక్రమణలపై లిఖితపూర్వక ఫిర్యాదులందితే చర్యలు తీసుకుంటాం. – రవికుమార్, తహసీల్దార్

స్పోర్ట్స్ కోటాలో గందరగోళం

గ్రామీణ క్రీడోత్సవాలు, పైకా, ఆర్‌జీకే, ఖేలో ఇండియాకు చోటు కరువు

- ఇవి స్పోర్ట్స్ కిందకు రావంటూ సర్టిఫికెట్ల తిరస్కరణ?
- ఉద్యోగాల్లో నష్టపోతున్నామని క్రీడాకారుల ఆవేదన

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రప్రభుత్వం ఉద్యోగాలు, ఉన్నత చదువుల్లో స్పోర్ట్స్ కోటా అమలు చేస్తోంది. అయితే స్పష్టమైన విధివిధానాలు లేక, అధికారులకు అవగాహన కల్పించకపోవడంతో అర్హులైన క్రీడాకారులు నష్టపోతున్నారని తెలుస్తోంది. రెండేళ్ల క్రితం రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా అమలు చేస్తూ సర్కారు జీఓ జారీ చేసింది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆడిన క్రీడాకారులకు ఫామ్–2 కేటాయించగా, ఫామ్–3 యూనివర్సిటీ స్థాయి, ఫామ్–4 రాష్ట్ర, జాతీయస్థాయి పాఠశాలల క్రీడల్లో మొదటి మూడు స్థానాలు సాధించిన వారే కాక పోటీల్లో ప్రాతినిధ్యం వహించిన వారి కోసం విడుదల చేశారు. అలాగే, ఫామ్–1ను అంతర్జాతీయ స్థాయి పోటీల్లో దేశం తరఫున ప్రాతినిధ్యం వహించిన వారికి కేటాయించారు. కాగా, ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా అమలు చేసే సమయాన అధికారులు కేవలం ఫామ్–2ను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటున్నారని పలువురు వాపోతున్నారు.

అందరినీ ఒకే రీతిలో..

ఫాం–2 కింద అసోసియేషన్ నిర్వహించే రాష్ట్ర, జాతీయ స్థాయి వరకు ఆడే క్రీడాకారుల సర్టిఫికెట్లను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి. కానీ అందరినీ ఒకే గాటిన పెట్టి సర్టిఫికెట్లను పరిశీలించి పాయింట్లు కేటాయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక ఫాం 1, 3, 4కు సంబంధించిన సర్టిఫికెట్ల గురించి పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. కేవలం ఫాం–2నే ప్రామాణికంగా తీసుకుని స్పోర్ట్స్ కోటా ద్వారా భర్తీ చేయడం ఎంత వరకు సమంజసమని క్రీడాకారులు ప్రశ్నిస్తున్నారు. ఫాం–2 కింద అసోసియేషన్‌కు సంబంధించిన టోర్నీల్లో ఆడిన సర్టిఫికెట్లను మాత్రమే పరిశీలించాలని నిర్ణయం తీసుకొవాడం ఏమిటని క్రీడాకారులు ప్రశ్నిస్తున్నారు. ఫాం–3కి వస్తే యూనివర్సిటీ క్రీడల్లో రాణించిన వారికే మాత్రం దీనిని పరిగణించాల్సి ఉండగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా ఫాం–2కే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు.

అవి పరిగణనలోకి తీసుకోకండి..

జిల్లాస్థాయిలో ఆడిన క్రీడాకారుల సర్టిఫికెట్లను పరిగణనలోకి తీసుకోవద్దని రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాకారులు కోరుతున్నారు. ఫాం–2లోనే జిల్లా స్థాయి క్రీడాకారుల సర్టిఫికెట్లను పరిశీలిస్తుండడంతో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులకు ఇబ్బందులు కలుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫాం–2లో కేవలం రాష్ట్ర, జాతీయ స్థాయి సర్టిఫికెట్లను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఖేలో ఇండియా టోర్నీలో పతకం సాధించినా..

భారత క్రీడా ప్రాధికార సంస్థ (శాయ్) ఆధ్వర్యంలో ఇప్పటి వరకు నిర్వహించిన జాతీయస్థాయి రూరల్, పంచాయతీ యువ క్రీడా ఖేల్ అభియాన్, రాజీవ్ గాంధీ క్రీడా అభియాన్, ప్రస్తుతం ప్రవేశపెట్టి ఖేలో ఇండియా క్రీడల్లో ప్రతిభ చాటిన వారి సర్టిఫికెట్లను పరిగణనలోకి తీసుకోవడం లేదని క్రీడాకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి ప్రత్యేక ఫాంను పొందురపర్చాలని కోరుతున్నారు.

విధి విధానాలు కరువు

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగాల నియామకం కోసం ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ కోటాను భర్తీ చేసేందుకు ఆయా జిల్లాల్లో కమిటీలు వేసినా కేవలం ఫాం–2ను మాత్రమే పరిగణనలోకి తీసుకోవడంలో అంతర్యమేంటనే అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కమిటీల్లో ఉన్న వారికి సర్టిఫికెట్లపై అవగాహన ఉందా, లేదా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కమిటీలు ఫాం–1, 2, 3, 4ను పరిశీలించి పాయింట్ల ఆధారంగా ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ కమిటీల్లో స్పోర్ట్స్ అథారిటీ వారిని నియమించకుండా కేవలం వ్యాయామ ఉపాధ్యాయులనే నియమించడంతో కొంత అవరోధం ఏర్పడుతోందనే విమర్శలు వస్తున్నాయి. అసోసియేషన్, పాఠశాలల క్రీడలు, ఇతర సర్టిఫికెట్లపై సోర్ట్స్ అథారిటీ అధికారులకు పూర్తిస్థాయిలో అవగాహన ఉంటుంది. అదే వ్యాయామ ఉపాధ్యాయులకు ఏ కేటగిరీకి ఎన్ని పాయింట్లు ఇవ్వాలనే దానిపై కొంత ఇబ్బంది కలిగే పరిస్థితి ఉందనే అభిప్రాయాలను క్రీడాకారులు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి జాతీయస్థాయి పోటీలకు వెళ్లిన అధికారులు సంబంధిత సర్టిఫికెట్లను పరిగణనలోకి తీసుకుంటే బాగుంటుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

